సాక్షి
ఖమ్మం

ఆదివారం ၊ 6 ၊ జూలై ၊ 2025



నేడు తొలి ఏకాదశి..

ఆషాఢ మాసంలో వచ్చే తొలి ఏకాదశితో హిందూ పండుగలు మొదలవుతాయి. ఆదివారం నాటి పండుగకు అంతా సిద్ధమయ్యారు. 8లో



'జూనోసిస్' ప్రమాదకరం

జూనోసిస్ వ్యాధులు ప్రమాదకరమని, ఈ వ్యాధులు మరణాలకు కూడా దారితీస్తాయని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. 8లో



వాతావరణం

జిల్లాలో ఆదివారం సాధారణ ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. కొన్ని చోట్ల సాయంత్రం చిరు జల్లులు పడే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

శ్రీ వేంకటేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు



భక్తులకు తీర్థం ఇస్తున్న అర్చకుడు

ఎర్రుపాలెం: తెలంగాణా తిరుపతిగా ప్రసిద్ధిగాంచిన జమలాపురం శ్రీ వేంకటేశ్వరస్వామి వారికి శనివారం అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు. శ్రీవారి పాదాలు, ఉత్సవ మూర్తులకు వేదమంత్రాల నడుమ పంచామృతాభిషేకం గావించారు. అనంతరం శ్రీ వారిని, శ్రీ అలివేలు మంగ, శ్రీ పద్మావతి అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించి నిత్య కల్యాణం నిర్వహించగా భక్తులు కనులపండువగా తిలకించారు. శ్రీవారికి పల్లకీ సేవ చేశారు. ఉమ్మడి తెలుగు రాష్ట్రాల భక్తులు స్వామివారిని దర్శించుకుని మొక్కులు సమర్పించారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ కె. జగన్‌మోహన్‌రావు, వ్యవస్థాపక ధర్మకర్త ఉప్పల శ్రీరామచంద్రమూర్తి, ప్రధానార్చకులు ఉప్పల శ్రీనివాసశర్మ, సూపరింటెండెంట్ విజయకుమారి, అర్చకులు రాజీవ్‌శర్మ, మురళీమోహన్‌శర్మ తదితరులు పాల్గొన్నారు.

నేడు మంత్రి పొంగులేటి పర్యటన

ఖమ్మంమయూరిసెంటర్: రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆదివారం ఉమ్మడి జిల్లాలో పర్యటించనున్నారు. ఉదయం 11 గంటలకు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కొత్తగూడెం క్లబ్‌లో జరిగే సమావేశంలో పాల్వంచ, లక్ష్మీదేవిపల్లి, చుంచుపల్లి, సుజాతనగర్ మండలాల ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు మంజూరు పత్రాలు పంపిణీ చేయనున్నారు. అలాగే, చుంచుపల్లి మండలం ధన్‌బాద్‌లోని మాయాబజార్, వనమాకాలనీ వాసులకు ఇళ్ల స్థలాల పట్టాలు అందజేస్తారు. ఆ తర్వాత లక్ష్మీదేవిపల్లి మండలం సీతారాంపురం వద్ద సీతారాపురం–రూప్లాతండా రహదారిపై హైలెవెల్ బ్రిడ్జి నిర్మాణానికి మంత్రి శంకుస్థాపన చేస్తారు. అలాగే, సాయంత్రం 6గంటలకు నేలకొండపల్లి మండలం కోనాయిగూడెంలో సీసీ రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేయనున్న మంత్రి పొంగులేటి.. కల్యాణలక్ష్మి లబ్ధిదారులకు చెక్కులను పంపిణీ చేశాక సుర్దేపల్లిలో రహదారి నిర్మాణానికి శంకుస్థాపన చేస్తారు.

డీసీఈబీ సెక్రటరీగా బాధ్యతల స్వీకరణ



వెంకటేశ్వర్లును సన్మానిస్తున్న డీఆర్పీలు, హెచ్‌ఎంలు

ఖమ్మం సహకారనగర్ : డిస్ట్రిక్ట్ కామన్ ఎగ్జామినేషన్ బోర్డు(డీసీఈబీ) సెక్రటరీగా చింతకాని మండలం నాగులవంచ హెచ్‌ఎం కనపర్తి వెంకటేశ్వర్లు శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయనను వివిధ సబ్జెక్టుల డీఆర్పీలతో పాటు పలువురు ఘనంగా సత్కరించారు. అనంతరం వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. విద్యారంగాభివృద్ధికి కృషి చేయడంతో పాటు, పరీక్షల నిర్వహణ పటిష్టతకు కృషి చేస్తానని చెప్పారు. కార్యక్రమంలో వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు రమేష్, దామోదర ప్రసాద్, సుబ్బారావు, డీసీఈబీ మాజీ కార్యదర్శి నారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఢిల్లీలో మేయర్, డిప్యూటీ మేయర్



పార్లమెంట్ భవనంలో మేయర్ నీరజ, డిప్యూటీ మేయర్ ఫాతిమా

ఖమ్మంమయూరిసెంటర్: ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ పునుకొల్లు నీరజ, డిప్యూటీ మేయర్ ఫాతిమా జోహరా మూడు రోజులుగా ఢిల్లీలో పర్యటిస్తున్నారు.

ఈ సందర్భంగా శనివారం అమృత్ పథకంపై చర్చల అనంతరం కొత్త, పాత పార్లమెంట్ భవనాలను ఇతర పట్టణాల మేయర్లతో కలిసి సందర్శించారు. అనంతరం లోక్‌సభ స్పీకర్ ఓంబిర్లాతో కలిసి ఫోటో సెషన్‌లో పాల్గొన్నారు.

పూటకొక షో

సామాన్యుడి నుంచి వీఐపీల వరకు వినోద సాధనం సినిమాలే. అందుకే పల్లె, పట్నం తేడా లేకుండా సినిమా హాళ్లు అందుబాటులోకి వచ్చాయి. గతంలో రోజుకు మూడు ఆటలతో సినిమాలు నడిచేవి. 80వ దశకం చివరి నుంచి మార్నింగ్ షో, మ్యాట్నీ, ఫస్ట్ షో, సెకండ్ షో అంటూ నాలుగు షోలు వేసేవారు. ఇక స్టార్ హీరోల సినిమాలైతే బెనిఫిట్‌షో, ఎర్లీ మార్నింగ్ షోలు అదనంగా ప్రదర్శించే వారు. ఇవి కాకుండా గంట, గంటన్నర నిడివి ఉండే బ్రూస్‌లీ, జాకీచాన్, జెట్‌లీ లాంటి చైనీస్ హీరోల యాక్షన్ సినిమాలు, ఏ సర్టిఫికెట్ సినిమాలు నూన్ షో పేరుతో థియేటర్లలో ప్రత్యేకంగా ప్రదర్శించేవారు. ఏ షో ప్రేక్షకులు ఆ షోలకు ఉండేవారు. గ్రామాల నుంచి పట్టణాలకు వచ్చే వారు ఎక్కువగా మార్నింగ్, మ్యాట్నీ షోలకు వెళితే, పట్టణాల్లో ఉండే వారు, ఉద్యోగులు ఫస్ట్‌షో, సెకండ్‌షోలను ఎంచుకునే వారు. కుర్రకారుకు నూన్‌షోలు ఫేవరేట్‌గా ఉండేవి.

– సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం



ఖమ్మం నగరంలోని ఓ థియేటర్

- ఒకప్పుడు థియేటర్‌లో ఒకే సినిమా నాలుగు ఆటలు
- మల్టీప్లెక్స్‌ల రాకతో మారిన ప్రదర్శన విధానం
- సింగిల్ స్క్రీన్లలో సింగిల్ సినిమాలకు తగ్గిన క్రేజ్
- ట్రెండ్‌కు తగ్గట్టు ఒకే తెరపై వేర్వేరు చిత్రాల ప్రదర్శన

సండే స్పెషల్

మరింత సౌకర్యవంతంగా మల్టీప్లెక్స్‌లు..

ఇళ్లలోకి టీవీలు వచ్చాక థియేటర్ల కథ ముగుస్తుందనే ప్రచారం జరిగింది. థియేటర్ ఎక్స్‌పీరియన్స్ పేరుతో డాల్బీ డిజిటల్, డిజిటల్ ట్రాక్ సౌండ్ (డీటీఎస్), డాల్బీ ఆట్మోస్ పేరుతో సౌండ్ క్వాలిటీ, కుషన్, కపుల్ చైర్స్ వంటి సౌకర్యాలతో ఏసీ హాళ్లు వచ్చాయి. దీంతో ఎంటర్‌టైన్‌మెంట్‌లో థియేటర్లు మరింత అగ్రస్థానానికి చేరుకున్నాయి. ఇదే క్రమంలో మరింత సౌకర్యవంతంగా మల్టీప్లెక్స్‌లు అందుబాటులోకి వచ్చాయి. ఒకే ప్రాంగణంలో రెండుకు మించి స్క్రీన్లు, మూడుకు పైగా సినిమాలు ప్రదర్శించడం మొదలైంది. టాయిలెట్లు మొదలు స్క్రీన్ వరకు అన్నింటా బెస్ట్ సర్వీస్ ఇచ్చేందుకు ప్రయత్నిస్తూ సినిమాకు సరికొత్త కేరాఫ్ అడ్రస్‌గా మల్టీప్లెక్స్‌లు నిలిచాయి.

ఓటీటీల రాకతో..

కరోనా సమయంలో విధించిన లాక్‌డౌన్ సినిమా థియేటర్ల పాలిట మృత్యుపాశంగా మారింది. ఓ వైపు మల్టీప్లెక్స్ హవా పెరుగుతుంటే మరోవైపు ఓవర్ ది టాప్ (ఓటీటీ) యాప్‌లు ఇబ్బడిముబ్బడిగా అందుబాటులోకి వచ్చాయి. రీజినల్, ఇంటర్నేషనల్ కంటెంట్ లోకల్ లాంగ్వేజ్‌లో అందుబాటులోకి వచ్చింది. దీంతో వినోద రంగంలో థియేటర్లకు గట్టి ప్రత్యామ్నాయం అందుబాటులోకి వచ్చినట్లయింది. ప్రేక్షకుడిని ఇంటి నుంచి థియేటర్‌కు రప్పించాలంటే స్టార్ పవర్.. లేదంటే మంచి కంటెంట్ ఉండక తప్పని పరిస్థితి ఎదురైంది.

ఒకే రోజు రెండు, మూడు సినిమాలు..

మారిన పరిస్థితులకు తగ్గట్టుగా సింగిల్ స్క్రీన్ థియేటర్లు తమ పంథాను మార్చుకోక తప్పడం లేదు. ఒకప్పుడు సింగిల్ స్క్రీన్లలో నాలుగు షోలూ ఒకే సినిమా నడిపించగా ఇప్పుడు ఒకే రోజు రెండు, మూడు సినిమాలు నడిపించే పద్ధతిని అమల్లోకి తెస్తున్నారు. సినిమాలో ఉండే కంటెంట్, వచ్చే ప్రేక్షకులను బట్టి షోలు ఏర్పాటు చేస్తున్నారు. శనివారం ఖమ్మం వినోద థియేటర్‌లో హాలీవుడ్ చిత్రం జురాసిక్‌పార్క్ తెలుగు డబ్బింగ్ వెర్షన్ మార్నింగ్, మ్యాట్నీ షోలు ఉండగా ఫస్ట్ షో, సెకండ్ షోలలో ఇంగ్లిష్ వెర్షన్ ప్రదర్శించారు. ఇదే సినిమా కొత్తగూడెం ఏషియన్ మహేశ్వరి, భద్రాచలం విజయ్‌భాస్కర్‌లలో మ్యాట్నీ, సెకండ్‌షోలు ఉండగా మిగిలిన షోలలో కన్నప్ప, కుబేరా సినిమాలు ఆడిస్తున్నారు. ఈ ట్రెండ్ ఆర్నెళ్ల క్రితమే మొదలైనా పాపులారిటీ ఉన్న సినిమాలు ఇలా ఆడకపోవడంతో ఈ అంశం వెలుగులోకి రాలేదు. కానీ ఇప్పుడు ఒకేసారి వేర్వేరు సినిమాలు ప్రేక్షకుల ఆదరణ చూరగొనడంతో ఒకే థియేటర్‌లో వేర్వేరు షోలకు వేర్వేరు సినిమాలు ప్రదర్శించే అవకాశం చిక్కింది. ట్రెండ్‌కు తగ్గట్టు సింగిల్ స్క్రీన్‌లే మల్టీప్లెక్స్ ఎక్స్‌పీరియన్స్ ఇచ్చేందుకు సిద్ధమయ్యాయి.

థియేటర్ల మూసివేత

గతంతో పోల్చితే స్టార్‌డమ్ ఉన్న నటుల నుంచి వచ్చే సినిమాలు తగ్గిపోవడం, ఓటీటీలో మంచి కంటెంట్ వస్తుండటంతో థియేటర్‌కు వచ్చే ప్రేక్షకుల సంఖ్య తగ్గిపోతోంది. ఫలితంగా అవి మూసేయాల్సిన పరిస్థితి ఎదురైంది. శుక్రవారం సినిమా విడుదలైతే మూడో రోజు నుంచే ప్రేక్షకుల సంఖ్య తగ్గుతుండడంతో షోలు రద్దు చేయడం రివాజుగా మారింది. కొన్ని థియేటర్లయితే క్రేజ్ ఉన్న సినిమా విడుదలైనప్పుడు తెరవడం, ఆ తర్వాత మూసేస్తున్నారు. తెలంగాణలో సినిమా ప్రదర్శనలకు గుండెకాయలా ఉన్న ఉమ్మడి ఖమ్మం జిల్లాలో థియేటర్లు మూతపడిపోవడం మొదలైంది. ఒకప్పుడు ఖమ్మంలో 11 థియేటర్లు ఉంటే ఇప్పుడు ఐదే మిగిలాయి. కొత్తగూడెంలో ఏడుకు బదులు నాలుగు, పాల్వంచలో నాలిగింట రెండు, ఇల్లెందులో మూడు, మణుగూరు, భద్రాచలంలలో మూడింట రెండు థియేటర్లే నడుస్తున్నాయి. ఇక మండల కేంద్రాల్లోని థియేటర్లు ఎప్పుడో మూతబడ్డాయి.

సూత్రాలను చట్టాలు ఉల్లంఘిస్తే సమీక్ష తప్పనిసరి

హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ చంద్రకుమార్



జస్టిస్ చంద్రకుమార్‌ను సన్మానిస్తున్న న్యాయవాదులు

మధిర: రాజ్యాంగంలో సూత్రాలను శాసనసభలో చేసే చట్టాలు ఉల్లంఘించినప్పుడు న్యాయవ్యవస్థ కచ్చితంగా న్యాయ సమీక్ష చేయాల్సిందేనని హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ బి.చంద్రకుమార్ అభిప్రాయపడ్డారు. మధిరలో ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ లాయర్స్ (ఐఏఎల్) ఆధ్వర్యాన శనివారం ఏర్పాటుచేసిన న్యాయవాదుల శిక్షణా తరగతులకు హాజరైన ఆయన.. ఆర్ట్ ఆఫ్ క్రాస్ ఎగ్జామినేషన్ ఇన్ క్రిమినల్ కేసెస్, ప్రొఫెషనల్ ఎథిక్స్ తదితర అంశాలపై మాట్లాడారు. ప్రజాస్వామ్యంలో శాసనసభ, న్యాయవ్యవస్థ, కార్యనిర్వాహక శాఖల పాత్ర దేనికదే ప్రత్యేకంగా ఉన్నందున ఒకరి పాత్రలోకి మరొకరు చొచ్చుకుపోకూడదన్నారు. ఎప్పుడైతే శాసన, కార్యనిర్వాహక శాఖలు న్యాయవ్యవస్థలోకి చొచ్చుకొచ్చి ప్రభావితం చేయాలని చూస్తాయో అప్పుడు వాటి మధ్య సంబంధం తెగిపోతుందని పేర్కొన్నారు. కాగా, శాసనసభలో ఆమోదం పొందే చట్టాలు ప్రజలకు ఆమోదయోగ్యంగా ఉండకపోతే ప్రజల నుంచి తిరుగుబాటు వస్తుందన్నారు. న్యాయ సమీక్ష అధికారం కోర్టులకు లేనప్పుడు న్యాయవ్యవస్థ రూపం ప్రజాస్వామ్యంలో కనుమరుగైపోతుందని ఆయన అభిప్రాయపడ్డారు. కంప్యూటర్ కాలంలోనూ దేశ ప్రజలు కోర్టులపై నమ్మకాన్ని పోగొట్టుకోలేదని పలు సందర్భాల్లో నిరూపితమైందని తెలిపారు. ఎంతమంది యువ న్యాయవాదులు ఈ వృత్తిలోకి వస్తే అంత త్వరగా కేసులు పరిష్కారం కావడానికి అవకాశం ఉంటుందని ఆశాభావం వ్యక్తం చేశారు. అలాగే, ప్రస్తుతం న్యాయవ్యవస్థ అత్యంత ఖరీదైనదిగా మారిందని, సామాన్యుడు సుప్రీంకోర్టు మెట్లు ఎక్కే పరిస్థితి లేదని చంద్రకుమార్ తెలిపారు. న్యాయవాదులు ప్రజా సంబంధాలు కొనసాగిస్తూ పేదలు నివసించే ప్రాంతాలకు వెళ్లి వారికి న్యాయ పరిజ్ఞానాన్ని కల్పించాలని, కార్మికులకు హక్కుల గురించి తెలియజేయాలని సూచించారు. తెలంగాణ స్టేట్ బార్ కౌన్సిల్ మెంబర్ జనార్దన్, సీనియర్ న్యాయవాది మామిడి హనుమంతరావు వివిధ అంశాలపై అవగాహన కల్పించారు. శిక్షణా తరగతులకు ప్రారంభానికి ముందు మధిర ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వేముల దీప్తిని ఐఏఎల్ బాధ్యులు సన్మానించారు. ఐఏఎల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వై ఉదయ భాస్కర్, సహాయ కార్యదర్శులు పి.పట్టాభి, వాసిరెడ్డి వెంకటేశ్వరరావు, జిల్లా అధ్యక్ష కార్యదర్శులు షేక్ లతీఫ్, ఓరుగంటి శేషగిరిరావు, కొత్తగూడెం జిల్లా కార్యదర్శి భాగం మాధవరావుతో పాటు పారుపల్లి అమర్‌చంద్, కోటం రాజు, మునిగడప వెంకటేశ్వర్లు, శాంతకుమారి, తెల్లప్రోలు వెంకటరావు, కావూరి రమేష్, షేక్ ఇమామ్‌వలి, నెల్లూరి రవికుమార్, గంధం శ్రీనివాసరావు షేక్ నస్రీన్, అరుణ, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బోజడ్ల పుల్లారావు పాల్గొన్నారు.

ఈ బ్యాంకు.. 'బంగారం'!

- ఆభరణాల తాకట్టుపై డీసీసీబీలో సులువుగా రుణాలు
- ఉమ్మడి జిల్లాలోని 50 బ్రాంచ్‌ల ద్వారా రూ.765 కోట్లు
- రాష్ట్రంలోనే మొదటి స్థానంలో ఖమ్మం డీసీసీబీ



నేలకొండపల్లిలోని డీసీసీబీ బ్రాంచ్

నేలకొండపల్లి: ప్రైవేట్ బ్యాంకులు, సంస్థలతో పోలిస్తే నిబంధనలు సరళంగా ఉండడంతో జిల్లా కేంద్ర సహకార బ్యాంకు(డీసీసీబీ) ద్వారా బంగారు ఆభరణాల తాకట్టుపై రుణాలు తీసుకునేందుకు రైతులు ఆసక్తి కనబరుస్తున్నారు. ఈ ఆర్థిక సంవత్సరం ఇప్పటివరకు కొత్తగా ఇచ్చిన రుణాలే కాక, రెన్యూవల్ కలిపి ఖమ్మం డీసీసీబీ రాష్ట్రంలోనే మొదటి స్థానంలో నిలవడం విశేషం. ఇప్పటివరకు బ్యాంకులోని బ్రాంచ్‌ల ద్వారా రూ.765 కోట్ల రుణాలు మంజూరు చేయడం రికార్డుగా నిలిచింది.

50 బ్రాంచ్‌లు

ఖమ్మం డీసీసీబీ నాలుగు జిల్లాల పరిధిలో విస్తరించి ఉంది. ఖమ్మం, భద్రాద్రి జిల్లాలే కాక మహబూబాబాద్, ములుగు జిల్లాల్లో కలిపి 50 డీసీసీబీ బ్రాంచ్‌లు ఉన్నాయి. వీటి పరిధిలో రైతులతో పాటు వివిధ వర్గాల ప్రజలు ఖాతాదారులుగా ఉన్నారు. కొన్ని నెలలుగా బంగారం తాకట్టు రుణాలపై బ్యాంక్ అధికారులు విస్తృత ప్రచారం చేయడంతో మంచి ఫలితాలు వచ్చాయి. అంతా సక్రమంగా ఉంటే పది నిమిషాల్లోనే రుణం మంజూరు చేస్తామని ప్రకటించడమే కాక దానిని పక్కాగా అమలు చేశారు. దీంతో డీసీసీబీ పరిధిలోని శాఖల్లో పలువురు కొత్తగా రుణాలు తీసుకోగా, గత ఆర్థిక సంవత్సరం తీసుకున్న వారు రెన్యూవల్ చేసుకున్నారు. నిబంధనలు సరళంగా ఉండటం, జాప్యం లేకుండా రుణం మంజూరు కావడంతో తీసుకునే వారి సంఖ్య పెరిగింది. ఇలా డీసీసీబీ పరిధిలోని బ్రాంచ్‌ల ద్వారా ఇప్పటి వరకు 57,519 మంది దాదాపు రూ.765 కోట్ల మేర బంగారు ఆభరణాల తాకట్టుపై రుణాలు తీసుకున్నారు. మరో వారంలోగా ఇది రూ.800 కోట్లు దాటుతుందని అంచనా వేస్తున్నారు. ఈ రుణాల్లో రాష్ట్రంలోనే ఖమ్మం డీసీసీబీ మొదటి స్థానంలో నిలవగా, రెండో స్థానంలో నల్లగొండ నిలిచింది. కాగా, ఆ రుణాల ద్వారా బ్యాంకుకు రూ.కోట్లలో వడ్డీ సమకూరనుంది.

సమష్టి కృషితోనే సాధ్యం..



బంగారం రుణాలు ఇవ్వడంలో రాష్ట్రంలోనే ప్రథమ స్థానంలో నిలవడం ఆనందంగా ఉంది. ఉద్యోగులు, పాలకవర్గ సభ్యులు సమష్టిగా ప్రచారం చేయడమే కాక నిబంధనల మేరకు త్వరగా రుణాలు మంజూరు చేస్తుండడంతో మంచి స్పందన లభించింది. ఇప్పటికే రూ.765 కోట్ల రుణాలు ఇవ్వగా.. వారం పది రోజుల్లో రూ.800 కోట్లు దాటుతుందని అంచనా వేస్తున్నాం.

– ఎస్.వెంకట్‌ఆదిత్య, సీఈఓ, డీసీసీబీ

లిఫ్ట్ ఇరిగేషన్‌లతో పుష్కలంగా సాగునీరు


కల్లూరురూరల్: లిఫ్ట్ ఇరిగేషన్లతో పుష్కలంగా సాగునీరు అందించేలా చర్యలు తీసుకున్నామని రాష్ట్ర ఇరిగేషన్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ మువ్వా విజయబాబు తెలిపారు. శనివారం ఆయన లింగాలలో విలేకరులతో మాట్లాడారు. లిఫ్ట్‌లకు మరమ్మతులు అవసరమైతే నిధుల కోసం అంచనాలు రూపొందించాలని అధికారులను ఆదేశించామని తెలిపారు. ప్రతీ ఎకరాకు సాగునీరు అందించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. వచ్చే సీజన్ నాటికి సీతారామ ప్రాజెక్టు నీరు అందుతుందన్నారు. రైతుబంధుతో పాటు సన్న ధాన్యానికి బోనస్ ఇచ్చి వ్యవసాయ రంగాన్ని అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. ఆయన వెంట నాయకులు మట్టూరి జనార్దన్, మద్దినేని లోకేశ్వరరావు, యాస వెంకటేశ్వరరావు, కాటేపల్లి కిరణ్‌కుమార్, యాస శ్రీకాంత్, తాళ్ల వెంకటేశ్వర్లు ఉన్నారు.



మాట్లాడుతున్న విజయబాబు

పర్యాటకాభివృద్ధికి రూ.5.20 కోట్లు

పాలేరుకు రూ.3.20 కోట్లు, బౌద్ధక్షేత్రానికి రూ.2 కోట్లు



నేలకొండపల్లిలోని బౌద్ధక్షేత్రం

నేలకొండపల్లి: జిల్లాలోని బౌద్ధక్షేత్రం, పాలేరు రిజర్వాయర్‌ను పర్యాటకంగా తీర్చిదిద్దనున్నారు. పర్యాటక ప్రాంతాల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం కార్యాచరణ రూపొందించడంతో పాటు నిధులు మంజూరు చేసింది. ఈ క్రమంలో కూసుమంచి మండలంలోని పాలేరు రిజర్వాయర్ వద్ద సదుపాయాల కల్పనకు రూ.3.20 కోట్లు, నేలకొండపల్లిలోని బౌద్ధక్షేత్రం అభివృద్ధికి రూ.2 కోట్లు మంజూరయ్యాయి.

టెండర్ల ఆహ్వానం..

పర్యాటక ప్రాంతాల అభివృద్ధికి నిధులు మంజూరు చేసిన నేపథ్యాన తెలంగాణ పర్యాటక అభివృద్ధి సంస్థ గతనెల 30న టెండర్లు ఆహ్వానించింది. ఈనెల 15వ తేదీ లోపు ప్రక్రియ పూర్తిచేసి పనులు మొదలుపెట్టాలనే లక్ష్యంతో ఉన్నారు. బౌద్ధక్షేత్రం, పాలేరు రిజర్వాయర్‌ను పర్యాటకంగా తీర్చిదిద్దడంపై స్థానికులు మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి దృష్టికి తీసుకెళ్లగా ఆయన నిధులు మంజూరు చేయించారు.

క్లుప్తంగా

ఎంపీడీఓల బదిలీలు

ఖమ్మంసహకారనగర్: గత ఎన్నికల సమయంలో ఎంపీడీఓల బదిలీలు జరగ్గా.. వారి వారి ప్రాంతాలకు బదిలీ చేస్తూ పంచాయతీరాజ్ డైరెక్టర్ జి.శ్రీజన శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. ఖమ్మం జిల్లాలో విధులు నిర్వర్తిస్తున్న జి.సురేందర్‌ను జయశంకర్ భూపాలపల్లి జిల్లాకు బదిలీ చేయగా.. జి.రవీందర్, ఎస్.కుమార్, బి.వేణుగోపాల్‌రెడ్డి, పి.సరస్వతి, ఎ.రోజారాణిని మహబూబాబాద్ జిల్లాకు బదిలీ చేశారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు చెందిన కావూరి మహాలక్ష్మిని ఖమ్మంకు బదిలీ చేశారు. వీరంతా వెంటనే ఆయా జిల్లాల్లో విధుల్లో చేరనున్నారు.

దూదేకుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా బడేసాహెబ్


బడేసాహెబ్

ఖమ్మంఅర్బన్: తెలంగాణ దూదేకుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా షేక్ బడే సాహెబ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఖమ్మంలోని కొత్తగూడెంలో శనివారం జరిగిన సమావేశంలో ఈ ఎన్నిక జరగగా ఆయన మాట్లాడారు. సంఘం బలోపేతానికి రాష్ట్ర మాజీ అధ్యక్షుడు ఫకీర్ సాహెబ్, గాలిబ్ సాహెబ్ ఎనలేని కృషి చేశారని, వారి ఆశయ సాధనకు అనుగుణంగా పనిచేస్తానని తెలిపారు. షేక్ సలీం అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి షేక్ పుల్లాసాహెబ్, నాయకులు షేక్ మీరా, మహమ్మద్ అబ్దుల్ కలాం, షేక్ అన్వర్‌పాషా, షేక్ మీరాసాహెబ్, షేక్ మౌలాలీ, షేక్ ఉద్దండుసయ్యద్, అన్వర్‌పాషా, షేక్ లతీఫ్, షేక్ సుల్తాన్ తదితరులు పాల్గొన్నారు.

బీటెక్ విద్యార్థి ఆత్మహత్య


యశ్వంత్ (ఫైల్)

ముదిగొండ: పరీక్షల్లో ఫెయిల్ అయ్యాననే మనస్తాపంతో బీటెక్ విద్యార్థి వ్యవసాయ బావిలోకి దూకి ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని వల్లాపురంలో శనివారం చోటుచేసుకుంది. వల్లాపురానికి చెందిన ఇండెమందుల యశ్వంత్ (19) హైదరాబాద్‌లో ఓ ప్రైవేట్ కళాశాలలో బీటెక్ చదువుతున్నాడు. ఇటీవల అమ్మమ్మ గారి ఊరైన వనంవారికిష్టాపురం వెళ్లాడు. కాగా, తొలి సెమిస్టర్ ఫలితాలు రాగా అందులో ఫెయిల్ అయ్యాడు. మనస్తాపంతో శుక్రవారం రాత్రి బయటకు వెళ్లి రాలేదు. సమాచారం అందుకున్న తల్లిదండ్రులు ఎంతగా గాలించినా ఫలితం లేకపోయింది. మరుసటి రోజు వనంవారికిష్టాపురం శివారులోని వ్యవసాయబావిలో విగతజీవిగా కనిపించాడు. మృతుడి తండ్రి పుల్లయ్య ఫిర్యాదుపై సీఐ మురళి కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

మద్యానికి డబ్బులివ్వలేదని..

రఘునాథపాలెం: మద్యం తాగేందుకు తల్లిని డబ్బులడిగితే ఇవ్వలేదంటూ యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన రఘునాథపాలెంలో చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన ఎం.నాగేంద్రబాబు(30) మద్యానికి బానిసయ్యాడు. ఈ క్రమంలో శుక్రవారం తల్లి భద్రమ్మను డబ్బు అడగగా ఆమె ఇవ్వలేదు. తల్లితో కాసేపు ఘర్షణ పడిన నాగేంద్రబాబు ఆ తర్వాత పురుగుల మందు తాగాడు. కుటుంబసభ్యులు ఆస్పత్రికి తరలించగా శనివారం మృతిచెందాడు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ ఉస్మాన్‌షరీఫ్ తెలిపారు.

పామాయిల్ గెలలు



టన్ను ధర	రూ.17,463

తొలి పండుగ.. ఎంతో ప్రత్యేకం

- ఇప్పటి నుంచి హిందువుల పండుగలు మరూ
- పేలాల పిండికి ప్రత్యేక స్థానం

నేడు తొలి ఏకాదశి



ఖమ్మంగాంధీచౌక్: ఆషాఢంలో వచ్చే తొలి ఏకాదశి నుంచి హిందూ పండుగలు మొదలవుతాయి. ఆనందంతో పాటు ఆరోగ్యానిచ్చే పండుగ ఇది. హిందువుల తొలి పండుగగా ఖ్యాతికెక్కిన తొలి ఏకాదశి పర్వ దినానికి హైందవ సంస్కృతిలో విశేష స్థానం ఉంది. ఒక ఏడాదిలో వచ్చే 24 ఏకాదశుల్లో ఆషాఢ శుద్ధ ఏకాదశిని 'తొలి ఏకాదశి'గా పిలుస్తారు. దీనినే 'శయన ఏకాదశి''హరి వాసరం''పేలాల పండుగ'అని కూడా అంటారు. ఆదివారం ఆషాఢ శుద్ధ ఏకాదశిని పండగగా జరుపుకునేందుకు హిందువులు సిద్ధమవుతున్నారు. అయితే ప్రత్యక్ష దైవమైన సూర్యుడు దక్షిణం వైపునకు మరలినట్లు, ఈరోజు నుంచి దక్షిణాయనం ప్రారంభాన్ని సూచిస్తుంది. ఈరోజున చాతుర్మాస వ్రతం ప్రారంభమవుతుంది. ఈ రోజున ఉపవాసం ఉంటే ఆ విష్ణుమూర్తి అనుగ్రహం లభిస్తుందని విశ్వాసం. ఈ రోజు ఉదయాన్నే నిద్రలేచి విష్ణుమూర్తిని తులసీదళాలతో పూజించాలి.

రాత్రంతా జాగరణ చేస్తూ విష్ణుమూర్తి నామస్మరణతో పూజలు చేస్తారు.

ఏకాదశి నియమాలు

ఏకాదశి రోజు మొత్తం నిరాహారులై ఉండాలి. ఏకాదశి రోజున సూర్యోదయానికి ముందుగానే శ్రీహరిని పూజించాలి. విష్ణుమూర్తి ప్రతిమను పసుపు కుంకుమలతో పూలతో అలంకరించి చక్కెర పొంగలి నైవేద్యం పెట్టి కర్పూర హారతినిస్తారు. ఈ రోజున కాల్చివండినవి, మాంసాహారం, ఉసిరి, ఉలవలు, మినుములు, వెల్లుల్లి వంటివి తినొద్దని పండితులు చెబుతున్నారు.

పేలాల పిండి ఆరోగ్యం..

తొలి ఏకాదశి రోజు పేలాల పిండికి ప్రత్యేక స్థానం ఉంది. ఈ పిండిని తప్పక తినాలని అంటారు. పేలాలు పితృ దేవతలకు ఎంతో ఇష్టమైనవని.. జన్మనిచ్చిన పూర్వీకులను ఈ రోజున గుర్తు చేసుకోవటం మన బాధ్యత అని పెద్దలు చెబుతుంటారు. అంతేగాక ఆరోగ్యపరంగా బయట ఉష్ణోగ్రతలకు అనుగుణంగా శరీరం అనేక మార్పులకు లోనవుతుంది. గ్రీష్మ రుతువు ముగిసిన తరువాత వర్ష రుతువు ప్రారంభమయ్యే కాలం. ఈ కాలంలో పేలాల పిండి తింటే శరీరానికి వేడిని కలిగిస్తుంది. ఈ రోజున మొక్కజొన్న పేలాలను మెత్తటి పొడిగా దంచి అందులో నూరిన బెల్లం కలిపి దేవుడికి నైవేద్యంగా సమర్పిస్తారు. దేవాలయాల వద్ద, ఇళ్ల వద్ద పేలాల పిండిని ప్రసాదంగా పంచుతారు.

మార్పులకు సంకేతం..



ప్రకృతిలో జరిగే మార్పులకు సంకేతం తొలి ఏకాదశి. సూర్య భగవానుడు ఈ రోజు నుంచి దక్షిణా యనం వైపునకు మరలుతాడు. హిందువులు తొలి ఏకాదశిని తొలి పండుగగా జరుపుకుంటారు. రైతులకు ఈ పండుగ ప్రత్యేకం. పాడి పంటలు సమృద్ధిగా ఉండాలని ప్రజలు తొలి ఏకాదశి రోజున ఉపవాసాలు, జాగరణ చేస్తారు.

–నందుల సుబ్రహ్మణ్యశర్మ, పురోహితులు

రైతుల పండుగ

తొలిఏకాదశి రైతుల పండుగగా పురాణాలు చెబుతున్నాయి. రైతులు ఈ పండుగను వేడుకలా జరుపుకుంటారు. అతివృష్టి, అనావృష్టి వంటి ప్రకృతి వైపరీత్యాలు సంభవించకుండా వేసిన పంటలకు ఎలాంటి తెగుళ్లు ఆశించకుండా ఉండాలని అన్నదాతలు తొలి ఏకాదశిరోజున ఇళ్లలో, ఆలయాల్లో ప్రత్యేకపూజలు చేస్తారు. వర్షాలు అనుకూలిస్తే వాగుల్లో, జలాశయాల్లో నీరు ప్రవహిస్తుంది. వాగుల్లో వర్షపునీరు ముందుగా ప్రవహిస్తే ఏరు ముందని, అంతగా వర్షాలు లేకపోతే ఏకాశి ముందని రైతులు ప్రత్యేకంగా చెప్పుకుంటారు. వర్షాలు అనుకూలించి పంటలు పండాలని ఏకాదశి రోజున అన్నదాతలు భగవంతున్ని ప్రార్థిస్తుంటారు.

ముగ్గురు నకిలీ విత్తనాల విక్రేతల అరెస్ట్


స్వాధీనం చేసుకున్న పత్తి విత్తన ప్యాకెట్

తల్లాడ: రైతులకు నకిలీ పత్తి విత్తనాలు విక్రయించేందుకు వచ్చిన ముగ్గురిని శనివారం పోలీసులు అరెస్ట్ చేశారు. మరో ముగ్గురు పరారయ్యారు. వారి వద్ద నుంచి తొమ్మిది నకిలీ పత్తి విత్తనాల ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నారు. వివరాలిలా ఉన్నాయి. ఖమ్మం జిల్లా ఎర్రుపాలెం మండలం కాచారం గ్రామానికి చెందిన బ్రహ్మాజీ, ఏపీ రాష్ట్రం ఎన్టీఆర్ జిల్లా రెడ్డిగూడెం మండలం కుదుప గ్రామానికి చెందిన బాలగాని గోపి, కె.పర్వ గ్రామానికి చెందిన మంగరాజు గోపి, తల్లాడ మండలం మిట్టపల్లికి చెందిన గంధం కోటేశ్వరరావు, జంగా గోపాల్‌రెడ్డి, పోత్రు శ్రీను ముఠాగా ఏర్పడి మిట్టపల్లి పరిసర గ్రామాల్లో నకిలీ పత్తి విత్తనాలు విక్రయిస్తున్నారు. విశ్వసనీయ సమాచారం మేరకు తల్లాడ ఎస్‌ఐ వెంకటకృష్ణ, ఏఓ ఎండీ తాజుద్దీన్ శుక్రవారం రాత్రి నకిలీ పత్తి విత్తనాలు విక్రయిస్తుండగా దాడి చేసి పట్టుకున్నారు. రూ.12వేల విలువైన తొమ్మిది అరుణోదయ పేరుతో ఉన్న నకిలీ పత్తి విత్తన ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నారు. మంగరాజు గోపి, బాలగాని గోపి, గంధం కోటేశ్వరరావును అరెస్ట్ చేశారు. బ్రహ్మాజి, గోపాల్‌రెడ్డి, శ్రీను పరారీలో ఉన్నారు.

పాత వంతెనపై రాకపోకల పునరుద్ధరణ

సాక్షి ఎఫెక్ట్..

ఖమ్మంక్రైం: ఖమ్మంలోని మున్నేటిపై కాల్వొడ్డు వద్ద ఉన్న పాత వంతెన మీదుగా శనివారం నుంచి వాహనాల రాకపోకలను పునరుద్ధరించారు. తీగల వంతెన నిర్మాణం కారణంగా కాల్వొడ్డు పాత వంతెన మూతపడడం, అక్కడి చప్టాపైకి వరద చేరి కొట్టుకుపోవడం.. ప్రకాశ్‌నగర్ వంతెన దూరం కావడంతో వాహనాలన్నీ రాపర్తినగర్ బ్రిడ్జి వద్దకు వస్తుండడంతో ట్రాఫిక్ జామ్ అవుతోంది. ఈ అంశంపై 'సాక్షి'లో శనివారం 'రహదారి కష్టాలు'శీర్షికన కథనం ప్రచురితమైంది. దీంతో స్పందించిన అధికారులు కాల్వొడ్డు పాత వంతెన మీదుగా ద్విచక్ర వాహనాలను అనుమతించాలని పోలీసులు నిర్ణయించారు. ఈ మేరకు శనివారం రాకపోకలు మొదలుకావడంతో రాపర్తినగర్ బ్రిడ్జిపై కాస్త భారం తగ్గినట్లయింది.

గురుకులాల్లో వసతుల కల్పనకు చర్యలు

కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి


అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్

ఖమ్మంమయూరిసెంటర్: రెసిడెన్షియల్ విద్యా సంస్థల్లో మౌలిక వసతుల కల్పనకు చర్యలు చేపడుతున్నామని కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తెలిపారు. దానవాయిగూడెంలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల, జూనియర్ కళాశాలను శనివారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సాంఘిక సంక్షేమ గురుకులంలో రూ.1.50 కోట్లతో చేపడుతున్న పనులు సకాలంలో పూర్తి చేయాలన్నారు. ప్రహరీ నిర్మాణంతో పాటు మిషన్ భగీరథ ద్వారా నీరు సరఫరా చేయాలని సూచించారు. ఇంకా చేపట్టాల్సిన మరమ్మతు పనులపై నివేదిక అందించాలని అధికారులను ఆదేశించారు. డైనింగ్ హాల్‌లో టేబుళ్ల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామన్నారు. ఆ తర్వాత బి.ఆర్.అంబేద్కర్ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ జూనియర్ కళాశాల (బాలికలు)లో రూ.10 లక్షలతో చేపట్టిన పనులను పరిశీలించారు. ప్రభుత్వ రెసిడెన్షియల్ విద్యాసంస్థలో చదువుకుని ఐఐటీ, నీట్ వంటి జాతీయ స్థాయి పోటీ పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధిస్తున్నారని, జిల్లా నుంచి కూడా గొప్ప ఫలితాలు సాధించేలా విద్యార్థులను ఉత్తేజపరచాలని అన్నారు. అనంతరం కోయచలక క్రాస్ రోడ్డు వద్ద గల మైనారిటీ రెసిడెన్షియల్ పాఠశాలను సందర్శించారు. విద్యార్థినులు నిత్యం చదువుతో పాటు కొంత సమయం క్రీడలకు కేటాయించాలని, పౌష్టికాహారం తీసుకోవాలని అన్నారు. కోతుల సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని చెప్పారు. మహాత్మా జ్యోతి బా పూలే విద్యాలయంలో వీధిదీపాలు, తాగునీటి సమస్యలు పరిష్కరించాలన్నారు. కలెక్టర్ వెంట సోషల్ వెల్ఫేర్ జోనల్ అధికారి స్వరూపారాణి, జిల్లా మైనారిటీ సంక్షేమాధికారి డాక్టర్ పురంధర్, ప్రిన్సిపాళ్లు విజయదుర్గా, శైలజ, రాజ్యలక్ష్మి, ఆర్‌ఎల్‌సీ అరుణకుమారి తదితరులు ఉన్నారు.

రూ.6 లక్షలు లాక్కున్న టాస్క్‌ఫోర్స్ పోలీసులు

ఖమ్మంక్రైం: గంజాయి అమ్మినట్లు కేసు పెడతామని బెదిరించి ఓ వ్యాపారి గుమస్తా నుంచి రూ.6 లక్షలను ఇద్దరు టాస్క్‌ఫోర్స్ పోలీసులు లాక్కున్న ఘటన వెలుగు చూసింది. ఈ వ్యవహారం ఉన్నతాధికారుల దృష్టికి చేరడంతో రూ.లక్ష మినహాయించి, రూ.5 లక్షలు ఇచ్చినట్లు తెలిసింది. వివరాలిలా ఉన్నాయి. ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌లో మిర్చి లావాదేవీలు నిర్వహించే రాజస్థాన్‌కు చెందిన వ్యాపారి వద్ద వెంకన్న గుమస్తాగా పనిచేస్తున్నాడు. ఆయన వ్యాపారానికి చెందిన డబ్బుతో వెళ్తుండగా టాస్క్‌ఫోర్స్‌లో పనిచేస్తున్న ఇద్దరు కానిస్టేబుళ్లు సోదా చేశారు. బ్యాగ్‌లో గంజాయి ఉందా అని బెదిరిస్తూ తనిఖీ చేయబోగా తాను మార్కెట్‌లో పనిచేస్తానని వ్యాపారానికి చెందిన నగదు ఉందని చెబుతున్నా వినలేదు. బ్యాగ్‌లో రూ.6 లక్షలు ఉండడంతో ఆధారాలు చూపించినా డబ్బు లాక్కుని గుమస్తాను పంపించారు.

చాంబర్‌కు.. ఆపై అధికారులకు

టాస్క్‌ఫోర్స్ కానిస్టేబుళ్లు బెదిరించి డబ్బు లాక్కున్న విషయాన్ని వ్యాపారి చాంబర్ ఆఫ్ కామర్స్ బాధ్యుల దృష్టికి తీసుకెళ్లారు. వారు పోలీస్ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయడంతో అంతర్గతంగా విచారణ చేయగా టాస్క్‌ఫోర్స్ కానిస్టేబుళ్ల వ్యవహారం నిజమేనని తేలడంతో చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వ్యాపారి, గుమస్తాను పిలిచి రూ.5 లక్షలు ఇచ్చేసినట్లు సమాచారం. మిగతా రూ.లక్ష ఖర్చయ్యాయని చెప్పినట్లు తెలిసింది. నిఘా వర్గాల విచారణలో ఇద్దరు కానిస్టేబుళ్లతోపాటు జర్నలిస్టు పాత్ర కూడా ఉందని గుర్తించారని సమాచారం. కాగా, ఇద్దరు కానిస్టేబుళ్లపై ఉన్నతాధికారులు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంపై ఓ ఏసీపీస్థాయి అధికారి హస్తం ఉందని సమాచారం.

బీఏఎస్‌కు విద్యార్థుల ఎంపిక

భద్రాచలం: గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యాన ఖమ్మం జిల్లాలోని బెస్ట్ అవైలబుల్ పాఠశాల (బీఏఎస్)ల్లో ఐదో తరగతిలో ప్రవేశానికి గత నెల 20వ తేదీన లక్కీ డ్రా ద్వారా విద్యార్థినులను ఎంపిక చేయగా పలువురు చేరలేదు. దీంతో కొత్త వారి ఎంపికకు భద్రాచలం ఐటీడీఏ కార్యాలయంలో శనివారం డ్రా నిర్వహించారు. ఈ మేరకు గిరిజన సంక్షేమ శాఖ ఖమ్మం డీడీ విజయలక్ష్మి డ్రా తీయగా, జనరల్ కేటగిరీ నుంచి 32 మందికి గాను ముగ్గురిని ఎంపిక చేశారు. కార్యక్రమంలో అధికారులు హరీశ్, అశోక్‌కుమార్, నారాయణరెడ్డి, రాములు, రాంబాబు, రాజేందర్, నర్సింహారావు, శ్రీనివాసరావు, ధనుష్ పాల్గొన్నారు.

ఈపీఎస్‌ను రూ.9 వేలకు పెంచాలి

ఖమ్మంమయూరిసెంటర్: ఎంప్లాయీస్ పెన్షన్ స్కీం (ఈపీఎస్) లబ్ధిదారులకు చెల్లించే పెన్షన్‌ను రూ.1000 నుంచి రూ.9 వేలకు పెంచాలని తెలంగాణ ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు ఎల్.గోపించద్, కల్యాణం నాగేశ్వరరావు, తా ళ్లూరి విష్ణు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. శనివారం ఖమ్మంలోని అసోసియేషన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేక రుల సమావేశంలో వారు మాట్లాడారు. 1995 లో చేసిన చట్టం ప్రకారం ఈపీఎస్ పెన్షనర్లకు నాడు రూ.1000 పెన్షన్‌గా నిర్ణయించారని, నాటి నుంచి ఇప్పటి వరకు ఎలాంటి పెంపుదల లేదన్నారు. మందుల ముత్తయ్య, ఎం.గణపతి, ఏటుకూరి రమా రావు తదితరులు పాల్గొన్నారు.

పరిహారం స్వాహాపై కదలిక

సాక్షి ఎఫెక్ట్..

తిరుమలాయపాలెం: భారీ వర్షాలు, వరదలతో ఆవులు, గేదెలు కొట్టుకుపోయి నష్టపోయిన రాకాసితండా రైతులకు ప్రభుత్వం నుంచి వచ్చిన పరిహారాన్ని మండల వెటర్నరీ డాక్టర్ భర్త వేరే ఖాతాకు మళ్లించిన ఘట నపై శనివారం సాక్షిలో ప్రచురితమైన 'పశువుల పేరిట పరిహారం స్వాహా? కథనంతో జిల్లా పశుసంవర్థక శాఖ అధికారులు స్పందించారు. ఈ మేరకు శనివారం స్థానిక వెటర్నరీ డాక్టర్‌ను వివరణ కోరుతూ లేఖ పంపించినట్లు సమాచారం. పశువైద్యాధికారిణి భర్త రాకాసితండాలో ఓ రైతుకు చెల్లించాల్సిన డబ్బులను వేరే ఖాతాకు మళ్లించడంతో ఆ రైతు శుక్రవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసిన విషయం విదితమే. ఈ ఘటనపై జిల్లా పశుసంవర్థక శాఖ అధికారి పురంధర్‌ను వివరణ కోరగా.. మండల పశువైద్యాధికారి వివరణ కోరామని, ఆ తర్వాత పూర్తి స్థాయిలో విచారణ చేపడతామని తెలిపారు.

చికిత్స పొందుతున్న మహిళ మృతి

చింతకాని: మండలంలోని నేరడ గ్రామంలో ఆలస్యం గోవిందమ్మ (54) పురుగులమందు తాగి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందగా.. శనివారం పోలీసులు కేసు నమోదు చేశారు. గోవిందమ్మ 2014 నుంచి కేన్సర్‌తో బాధపడుతుండగా జీవితంపై విరక్తి చెంది గత నెల 30వ తేదీన పురుగులమందు తాగింది. కుటుంబీకులు ఆమెను ఖమ్మం ఆస్పత్రికి, ఆ తరువాత హైదరాబాద్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందింది. మృతురాలి కుమారుడు శివకృష్ణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తుచేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

జూనోసిస్ వ్యాధులు ప్రమాదకరం


- సాధు జంతువుల నుంచి సంక్రమణ
- వైరస్, బ్యాక్టీరియాల ద్వారా వ్యాప్తి
- రేబిస్, మెదడువాపు, ఆంత్రాక్స్ వంటివి ప్రాణాంతకమంటున్న వైద్యులు

నేడు 'జూనోసిస్ డే'


డాక్టర్ అరుణ

ఖమ్మంవ్యవసాయం: జూనోసిస్ వ్యాధులు ప్రమాదకరమైనవి. పశువుల నుంచి మానవులకు, మానవుల నుంచి పశువులకు సంక్రమించే స్వభావమున్న వ్యాధులను జూనోసిస్ వ్యాధులు అంటారు. ఇవి మరణాలకు కూడా దారితీస్తాయి. 1885 జూలై 6న శాస్త్రవేత్త లూయిస్ పాశ్చర్ పిచ్చికుక్క కాటుతో వచ్చే వ్యాధి రేబిస్ నివారణకు రేబిస్ టీకాను కనుగొన్నాడు. కుక్క కాటుకు గురైన బాలుడు జోసెఫ్ మీస్టర్‌పై ప్రయోగించి విజయం సాధించారు. అప్పటి నుంచి పెంపుడు జంతువులకు రేబిస్ సోకకుండా ముందుగా యాంటీ రేబిస్ టీకాను ఇస్తారు. ఏటా జూలై 6వ తేదీన ప్రపంచ జూనోసిస్ దినోత్సవంగా జరుపుకుంటున్నారు. పాలు, మాంసం, గుడ్ల కోసం పెంపుడు జంతువులను, కోళ్లను పెంచుతున్నాడు. మానసిక ఉల్లాసం కోసం కుక్కలను పెంచుతున్నారు. పెంపుడు జంతువుల వలన కూడా మానవులు అనేక వ్యాధుల బారిన పడుతున్నారు. జూనోసిస్ వ్యాధుల రకాలు, వాటి నివారణ గురించి ఖమ్మం పశు వ్యాధి నిర్ధారణ ప్రయోగశాల సహాయ సంచాలకులు డాక్టర్ అరుణ వివరించారు.

కారకాలు..



- బ్యాక్టీరియా: ఆంత్రాక్స్, బ్రూసెల్లోసిస్ లెప్టోస్పైరోసిస్, క్షయ
- వైరస్: రేబిస్, బర్డ్‌ఫ్లూ, మెదడువాపు, సార్స్, మేడ్‌కౌడిసీజ్
- ప్రొటోజువా: టాక్సోప్లాస్మోడియా, లీష్మెనియాసిస్
- రెకెట్షియా: టిక్, టైఫస్, క్యూఫీవర్
- హెల్మెంత్స్: ఎకైనోకోకోసిస్, టీనియాసిస్
- ఎక్టోపారాసైట్స్: స్కేబిస్

రేబిస్: ఇది పిచ్చికుక్క కాటు ద్వారా వ్యాప్తి చెందే అతి భయంకరమైన వ్యాధి. పిచ్చికుక్కల లాలాజలంలో వ్యాధికారకం 'రేబిస్' వైరస్ ఉంటుంది. మనుషుల శరీరంపై ఉన్న పుండును నాకినా లాలాజలం ద్వారా వ్యాధి సోకుతుంది. కుక్క కరిచిన వారం నుంచి 10 రోజుల లోపు వ్యాధి లక్షణాలు కనిపిస్తాయి.

- మనుషుల్లో ఈ వ్యాధిని హైడ్రోఫోబియా అంటారు.
- ఈ వ్యాధి సోకిన మనిషి గుటక వేయలేడు.
- దాహం వేస్తున్నా నీళ్లు తాగమంటే భయపడతాడు.

నివారణ: కుక్క కరిచిన వెంటనే ఆభాగాన్ని సబ్బుతో శుభ్రంగా కడగాలి. డాక్టర్‌ను సంప్రదించి చికిత్స చేయించుకోవాలి. పెంపుడు కుక్కలకు యాంటీ రేబిస్ టీకాలు వేయించాలి.

బర్డ్‌ఫ్లూ వ్యాధి: బర్డ్‌ఫ్లూ లేదా ఇన్‌ఫ్లూయెంజా వ్యాధి కోళ్లను, ఇతర పక్షులను ఆశిస్తుంది. ఇది వైరస్‌తో కలిగే వ్యాధి. ఇది కోళ్లు, పక్షుల నుంచి మానవులకు సంక్రమిస్తుంది. వ్యాధి సోకిన మనుషుల్లో జలుబు, గొంతునొప్పి, దగ్గు, కండ్లకలకతో మొదలై ఊపిరితిత్తుల్లో రక్తం చేరి మరణానికి దారి తీస్తుంది. ఈ వ్యాధి నివారణకు కచ్చితమైన టీకా ఇంతవరకు కనుగొనలేదు.

మెదడువాపు: వ్యాధి కారక వైరస్‌లు పందుల నుంచి దోమకాటు ద్వారా మనుషులకు వ్యాపిస్తాయి. ఇళ్ల దగ్గర పందుల సంచారం లేకుండా చూసుకోవాలి.

ఆంత్రాక్స్: ఈ వ్యాధి బాసిల్లస్ ఆంత్రాసిస్ అనే బ్యాక్టీరియా వల్ల వస్తుంది. వ్యాధి సోకిన పశువుల పొట్ట ఉబ్బి అకస్మాత్తుగా చనిపోతాయి. వ్యాధి సోకిన మనుషుల్లో జ్వరం, న్యూమోనియా వస్తుంది.

బ్రూసెల్లోసిస్: ఈ వ్యాధి పశువుల్లో బ్రూసెల్లా అబార్టస్ బూసెల్లా మెలిటెన్సిస్ అనే బ్యాక్టీరియా వల్ల వస్తుంది. ఈ వ్యాధి మనుషులు, అన్నిజాతుల పశువులకు సోకుతుంది. ఇవిగాక మైకో బ్యాక్టీరియా, ట్యూబర్‌క్యులోసిస్‌తో క్షయ, లెప్టోస్పైరా ఇక్టిరోహియో రెజికా బ్యాక్టీరియాతో లెప్టోస్పైరోసిస్ వ్యాధులు వ్యాపిస్తాయి.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు..

- జూనోసిస్ వ్యాధులన్నీ పశువులకు సోకకుండా వ్యాధి నిరోధక టీకాలు వేయించాలి.
- వీధి కుక్కలకు యాంటీ రేబిస్ టీకాలు వేయించి లైసెన్సులు ఇవ్వాలి.
- పెంపుడు జంతువులతో, కోళ్లతో సన్నిహితగా మెలిగే వాళ్లు జూనోసిస్ వ్యాధులపై అవగాహన కలిగి ఉండాలి.